# పాఠం

గిరిని చూస్తూనే ప్రకాశరావు ఎదురెళ్ళి మేనల్లుడి భుజం చుట్టూ చేయి వేసి లోపలకు తీసుకు వెళ్ళి " ప్రయాణం బాగానే జరిగిందిగా...?" అంటూ ఆరా తీసాడు.

" బెర్తు కూడా దొరికింది " అంటూ తలవూపి అటూ ఇటూ చూస్తూ " అత్తయ్య కనిపించదేం మావయ్యా..?" అని ప్రశ్నిస్తూనే తన సందేహాలనూ బయట పెట్టాడు.

" ఎందుకు మామయ్యా...నా సాయం కావాలని అర్జంటుగా బయలుదేరి రమ్మన్నావ్ ? నాకేం అర్థం కాలేదు. సరిగ్గా అపుడే అమ్మ కూడా నీకు అవసరమని అడిగావని డబ్బు కూడా ఇచ్చి రావాలని చెప్పింది. పక్కింటివాళ్ళకి ఈ వూళ్ళో బంధువులున్నారట. వాళ్ళబ్బాయి ఎప్పటినుండో వాళ్ళ బాబాయ్ ఇంటికి వెళ్ళాలనుకుంటున్న విషయం తెలిసి ఆ అబ్బాయినీ తోడు తీసుకుని వెళ్ళమని అమ్మ పురమాయించింది. నీకిచ్చిన డబ్బులో ఎంత వుందో సరిచూడు మావయ్యా..ఆ తర్వాత అమ్మకి ఫోన్ చేసి చెబుదువుగానీ...! " అన్నాడు గిరి.

“అలాగే...నీ సందేహాలన్నిటికీ సమాధానాలు నిదానంగా చెబుతాగానీ, ముందు టిఫిన్ చేద్దాం. ఆ గదిలో నీ బ్యాగ్ పెట్టుకుని నీ పనులన్నీ కానివ్వు.." అని చెప్పిన ప్రకాశరావు మాటలకు గిరి తలవూపుతూ అటువైపు అడుగులు వేశాడు.

తన చేతిలోని చిన్న బ్యాగును లోపల బీరువాలో పెట్టటానికి వెళ్ళాడు ప్రకాశరావు. వంటచేసే ఆవిడ టేబుల్ మీద సర్దిపెట్టిన టిఫిన్ చేస్తున్నపుడు " అక్క కూడా కనుపించటం లేదేం ? " అని గిరి మళ్ళీ అడిగాడు.

ప్రకాశరావు నిట్టూర్చి " ఇంకా నిద్ర లేవలేదులే...నా గదిలో కూర్చుందాం...రా..." అంటూ గిరి చేయి పట్టుకుని తన గదిలోకి తీసుకువెళ్ళిన ప్రకాశరావు పక్కనే కూర్చున్న గిరితో మెల్లగా చెప్పటం మొదలుపెట్టాడు.

" నువ్వు...ఇక్కడ రెండేళ్ళుండి చదువుకున్నావ్...గుర్తుందిగా. అప్పటి రోజుల్లో నీకు అర్థం కానివి చెబుతూండేవాడినికదా, ఒకరోజు నీకు ఒక లెక్క గురించి వివరంగా చెప్పి, ఇంకోటి అదే మోడల్ ది చేయమనగానే నా వైపు అయోమయంగా చూశావు. నేనేదో చిరాకులో ఉండి ' ఇంత వివరంగా చెప్పినా అర్థం కానట్లు అలా అయోమయంగా చూస్తావేంట్రా...' అని కోప్పడితే, అక్కడే వున్న మీ అక్క నందిని ' నేనూ విన్నాగా నాన్నా...గిరికి నేను చెబుతాలే..మీరు లోపలకి వెళ్ళి పని చూసుకోండి..' అంటే సరేనని నేను లోపలకు నా గదిలోకి వచ్చేసాను. కాసేపటిలోనే నువ్వు వచ్చి అక్కడే కూర్చుని అదే మాదిరిగా ఉన్న మిగతా లెక్కలన్నీ కూడా చకచకా చేసి

చూపించేసావ్ ! నేను ఆశ్చర్యంగా చూస్తే.. ఏం బదులు చెప్పావో గుర్తుందిగా....' అక్కంటే భయం లేదు కాబట్టి చనువుగా అడిగి నా సందేహాలన్నీ తీర్చుకోగలను అందుకే , బాగా అర్థం అయింది.అన్నావు, అవునా..?"

గిరి ప్రకాశరావు వైపు ఆశ్చర్యంగా చూస్తూ " ఇపుడు అదంతా ఎందుకు గుర్తు చేస్తున్నావు మావయ్యా..?" అనడిగాడు.

" అంటే..." అంటూ ప్రకాశరావు గట్టిగా నిట్టూర్చాడు. " నీకూ, నందినికీ మధ్య మంచి స్నేహం, చనువు వున్నాయి కాబట్టి...ఇపుడు..నువ్వు మీ అక్కకి ఓ పాఠం చెబుతావని...నీకు అర్థం కాలేదు కదూ..?" అయోమయంగా చూస్తున్న గిరిని అడిగాడతను.

అవునన్నట్లు చూశాడు గిరి.

" నిన్న ఉదయం...మీ అక్క ఏం చేసిందో తెలుసా...ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోబోయిందిరా...మీ అత్తయ్య అది చూసి అడ్డు వెళ్ళి ఆపటంతో ప్రమాదం తప్పిందిగానీ, మీ అత్తయ్య మాత్రం షాక్ తో డీలా పడిపోయింది ! వెనకటి జబ్బు తిరగబెట్టిందో ఏమో మరి తెలియదుగానీ...నందిని చేయబోయిన అఘాయిత్యం తలచుకుని..తలుచుకుని..మాటిమాటికీ ఫిట్స్ బారిన పడుతుంటే...వాళ్ళన్నయ్య డాక్టరేగా, ఫోన్ చేసాను. నందిని విషయం చెప్పకుండా మీ అత్త ఆరోగ్య వివరాలు మాత్రం చెప్పాను. ప్రక్క వూళ్ళోనే ఉంటాడుగా..వెంటనే బయలుదేరి వచ్చి...నాలుగురోజులు విశ్రాంతిగా తమ దగ్గర వుంటుందంటూ కారులో ఎక్కించుకుని తీసుకువెళ్ళాడు. నాలుగురోజుల్లో వచ్చేస్తుంది. తను బాగానే ఉందని మా బావమరిది చెప్పాడులే." అంటూ ఒక నిమిషం నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

గిరికి కూడా షాక్ తగిలినట్లయింది.

" నిజమా..?" అన్నట్లు ఆశ్చర్యంగా చూశాడు. మళ్ళీ ఒక క్షణం ఆగి " నేను చేయగలిగినదేమిటి మావయ్యా..?" మెల్లగా నసిగినట్లు అడిగాడు.

గిరి హైస్కూల్ లో ఉన్నపుడు, అతని తండ్రికి మరో రాష్ట్రానికి ట్రాన్స్ఫరు అయింది. గిరి చదువుకు ఇబ్బంది కలగకుండా స్వరాష్ట్రంలోనే, విజయవాడ కాలేజీ లో మాథ్స్ లెక్చరర్ గా పని చేస్తున్న, గిరి తల్లి సుజాత తమ్ముడు ప్రకాశరావు సలహా, సమ్మతితో అతని ఇంట్లో ఉంచింది, రెండేళ్ళు చదువు కొనసాగించటానికి. ఆ పైన అతను మాథ్స్ లెక్చరరుగా ఉద్యోగం చేస్తున్నాడు కాబట్టి గిరి చదువుకూ ఉపయోగకరంగా ఉంటూందని భావించింది.

ప్రకాశరావు కూడా బాధ్యతగా అతని చదువు సంధ్యలూ, బాగోగులూ పట్టించుకుంటూ...తన కూతురు నందినికీ, గిరికీ చదువు విషయంగా తనకి సమయం ఉన్నపుడు చెబుతూండేవాడు. ఆ రెండు సంవత్సరాలూ మావయ్య వాళ్ళింట్లో వుండటం వలన బంధువులందరిలోకీ అత్తయ్య, మావయ్యల పట్ల అతనికి గౌరవాభిమానాలూ, అక్క నందినితో చనువు, స్నేహం ఏర్పడ్డాయి.

స్కూల్ నుండి రాగానే వాళ్ళిద్దరూ అరుగు మీద కూర్చుని చదువు సాగించేవాళ్ళు. పెరట్లో అరుగు పక్కనే పెద్ద మామిడి చెట్టు ఉండేది. రాత్రి పూట  అయినా హాయిగా చదువుకోవచ్చని ప్రకాశరావు గోడకి ఓ లైటు పెట్టించాడు. నందిని, గిరి ప్రతిరోజూ సాయంకాలాలు, రాత్రి పూట కూడా కబుర్లు చెప్పుకుంటూనే మధ్య మధ్యలో పాఠాల్లోని సందేహాలు తీర్చుకుంటూ చదువు కొనసాగించటం జరిగేది. ఆ మామిడి చెట్టు చల్లని గాలికి అరుగు మీద కూర్చుని చదువుకోవటం సరదాగా, హాయిగా ఉండేది. ప్రకాశరావు కూడా తనకి వీలున్న సమయాల్లో అక్కడే కూర్చుని వాళ్ళ సందేహాలను నివృత్తి చేస్తూ పాఠాలు చెబుతు ఉండేవాడు. అంతేకాకుండా, చాలాసార్లు అంతా అక్కడే కూర్చుని ఫలహారాలూ, భోజనాలూ కూడా కానిచ్చేయటం  గిరికీ చాలా ఇష్టంగా ఉండేది. ఆ జ్ఞాపకాలతో  ప్రకాశరావు సాయం కావాలని చెప్పగానే ఏమిటి, ఎందుకు అని అడగకుండా బయలుదేరి వచ్చేసాడు. తల్లితో తనకి డబ్బు అవసరమని తనతో పంపించమని మావయ్య ఎందుకు చెప్పాడో అతనికి అర్ధమైంది.

ఎంతో ధైర్యంగా ప్రవర్తించే నందిని అలాంటి పని తలపెట్టటమేంటో మాత్రం అతనికి అర్ధం కాలేదు. మనసూ ఆర్ద్రమైంది.

అతని ఆలోచనలు గమనించిన వాడిలా ప్రకాశరావు గొంతు సవరించుకుని వివరించాడు. " పరీక్షలు సరిగా రాయలేకపోతోందట...ఆ విషయం మాకు చెప్పలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని రాసిపెట్టింది. సరిగా చదవలేకపోతే, ఆ తప్పుని సరిచేసుకోవటానికీ, ధైర్యంగా ఏ విషయమైనా ఆత్మీయులతో, కన్నవాళ్ళతో పంచుకోవటానికీ సిద్ధ పడాలి ! అవునా...అలా కాకుండా జీవితాన్నే వద్దనుకుంటే...తనకి బాధ లేకుండా ఉంటూందేమోగానీ, మరి తనని ప్రేమించే ఆత్మీయులు, కన్నవాళ్ళ సంగతేమిటీ ? నిష్కారణంగా వాళ్ళకి జీవితాంతపు వ్యధని శిక్షగా విధించటమే కదా..? ఇది చాలా స్వార్ధంగా అనిపిస్తుంది నాకు !

ఏం...జీవితాన్ని వదులుకోవటానికి సిద్ధపడే బదులు...సమస్యని పరిష్కరించుకోవటానికి, పోరాటానికి జీవితాన్ని ఉపయోగించుకోవచ్చు కదా..ఇలా ఎందుకు ఆలోచించలేకపోతున్నారూ ?

ఆర్ధిక సమస్యలు..అవమానాలూ..ప్రేమలు..చదువులు..జీవిత భాగస్వామితో గొడవలు..ఇవేగా ఆత్మహత్యలకు కారణాలు..! ఆలోచిస్తే,  ఇవన్నీ పరిష్కార మార్గం దొరకని సమస్యలేం కాదు. నిన్నటి ఉదయం నుండీ ఈ  ఆలోచనలే నా మనసుని తొలిచేస్తున్నాయి ! మొన్నీ మధ్యనే నా ఫ్రెండు కొడుకొకడు ప్రేమ వైఫల్యంతోనట...ఆత్మహత్య చేసుకున్నాడు ! అంటే...ఏమిటర్ధం..? వాడు ప్రేమించిన అమ్మాయిదేనా ప్రేమ..? అతనిని కని పెంచిన వాళ్ళది కాదా..? తోబుట్టువులూ...స్నేహితులూ లాంటి ఆత్మీయులు ఉంటారుగా..వాళ్ళ ప్రేమాభిమానాలకు లెక్క లేనట్లు, ఒకే ఒక్కరి ప్రేమ దక్కకపోతేనో, కాదంటేనో ప్రాణాలు తీసుకోవటమేంటి ? అది...తనని ప్రేమించేవాళ్ళందర్నీ అవమానానికి గురి చేయటమేనన్నది నా అభిప్రాయం ! ఒక దారి మూసుకుపోతే, మరొక దారి ఉండనే ఉంటుందంటారు...నిజమేగా !

నీకు ఇదంతా ఎందుకు చెబుతున్నానో అర్థం అయిందిగా ! నా ఈ ఆలోచనలన్నీ సమయానుసారం మీ అక్కకీ అర్థమయ్యేట్లు ఓ పాఠంలా మనసుకు హత్తుకునేట్లు చెబుతావని ! అందుకే నీ సాయం కావాలని నిన్ను రప్పించానన్నమాట ! మీ ఇద్దరూ ఒక తరం వాళ్ళు. ఆ పైన నీ దగ్గర ఉన్న చనువు, స్నేహం బట్టి తన ఆలోచనలన్నీ నీతో సంకోచం లేకుండా పంచుకోగలుగుతుందనిపించింది. నిజమే కదా ! ఇంకో మాట...ఆ మధ్య నాకు ఒక పెద్దావిడతో పరిచయం ఏర్పడింది. ఆవిడ ఒక ఎలిమెంటరీ స్కూల్ లో టీచరుగా పనిచేస్తూ కొడుకుని ఇంజనీరింగు చదివిస్తోంది ! ఏదో ఒక ఉద్యమం కారణంగా ఆ అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడట ! ఆవిడకు మతి చలించిందని ఉద్యోగం నుండి తీసేసారు ! చనిపోదామనుకున్న ఆమె ఎందుకు, ఎలాబ్రతికిందో..అదంతా నాకు చెప్పుకువచ్చింది !

నేనదంతా అప్పుడు పట్టించుకోలేదుగానీ. ఇపుడు ఆలోచిస్తుంటే, చాలామంది ఆవిడ జీవితం నుండి పాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తోంది ! ఆవిడకు నేనేదో నాకు తోచిన సాయం చేస్తుంటాలే, అందుకని అపుడపుడూ కలుస్తూంటాను. రేపు ఓసారి ఏదో పని చెప్పి మిమ్మలిద్దర్నీ ఆవిడ దగ్గరకు పంపిస్తాను. ఆవిడ చెప్పే మాటలు నందినికి బాగా ఉపయోగపడతాయి ! నిన్న కాలేజీకి రాలేదని తన ఫ్రెండ్స్ వచ్చి వెళ్ళారు. ఆరోగ్యం కొంచెం సరిగాలేదని నాలుగురోజులు డాక్టరు రెస్టుగా ఉండమన్నారని చెప్పా ! ఈ రెండురోజులూ కొంచెం నువ్వు కనిపెట్టి భరోసా కలిగేట్లు మాటలు చెప్పు. ఏమంటావ్ ? " అంటూ ప్రకాశరావు గిరి వైపు చూశాడు.

" నాకిదంతా చాలా షాకింగా , అయోమయంగా ఉంది మామయ్యా.." మెల్లగా గొణిగినట్లు అన్నాడు గిరి.

" అవున్రా..మాకూ అలాగే వుంది ! ఏం చేస్తాం...తట్టుకోవాలి..తప్పదు ! " అంటూ నిట్టూర్చాడు.

" సరే మామయ్యా... నేనీ రెండురోజులూ అక్కతో ఉండి..మెల్లగా మాటల మధ్య తన సమస్య గురించి తెలుసుకుని, నువ్వు చెప్పిన నీ ఆలోచనల పాఠం చెప్పటానికి ప్రయత్నిస్తాను.." అన్నాడు గిరి మెల్లగా.

విభ్రాంతిగా, కొంచెంగా తలవంచుకుని కూర్చున్న గిరి భుజం తట్టాడు ప్రకాశరావు.

" నాకిపుడు నీ మాటలతో ధైర్యం వచ్చిందిరా ! సరే, రేపు నేను చెప్పిన ఆ పెద్దావిడ దగ్గరకు నందినిని తీసుకువెళ్లువుగానీ ! " అన్నాడు.

****

ఆ మరునాడు ప్రకాశరావు చెప్పిన ఆనవాళ్ళ ప్రకారం ఆవిడ దగ్గరకు వెళ్ళారు గిరి, నందిని.

ఆవిడ ఇంటి ముందు చిన్న కిరాణా కొట్టు ఉంది. అది ఆవిడదేనట. ప్రకాశరావు పంపించాడంటూ కవరు ఆవిడకు అందించారు.

" ఆ అయ్యగారు ఏ సూపర్ మార్కెట్ లోనో కాకుండా నాకు సాయం చేయాలనే ఉద్దేశ్యంతోనే నా దగ్గిర సరుకులు కొంటూ వుంటారు..అందుకనే ఇవ్వాల్సిన దానికంటే కొంచెం ఎక్కువే ఇస్తూంటారు. " అంది అభిమానంగా వాళ్ళని చూస్తూ.

అక్కడ ఇంటిముందు ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూ నందిని " మీ మనవలా ?" అనడిగింది.

అవునని తలూపింది. గిరి ఏం చదువుతున్నారంటూ ప్రశ్నలడిగి, మీ అబ్బాయి ఏం చేస్తూంటాడని అడిగాడు.

దానికావిడ నిట్టూరుస్తూ చెప్పింది " ఇంజనీరింగు ఆఖరి సంవత్సరం చదువుతూ చనిపోయాడు. చదువు పూర్తి కాగానే మంచి ఉద్యోగంలో చేరాక మరుసటి సంవత్సరంలో పెళ్ళి చేద్దామని మేం సంబరంగా ఎదురు చూస్తూంటే, ఉద్యమం కోసమంటూ వాడు ప్రాణాలు తీసుకుని మమ్మల్ని నట్టేట ముంచాడు." అంది. వాళ్ళిద్దరూ ఆవిడవైపు విచిత్రంగా చూస్తుంటే, ఆవిడ మళ్ళీ మొదలు పెట్టి చెప్పుకొచ్చింది.

" మీకు విచిత్రంగా అనిపిస్తోంది కదూ ? అర్థమయ్యేట్లు చెబుతాను. ఒకరోజు మా అబ్బాయి ఊరికి వచ్చాడు. ఏదో ఉద్యమం నడుస్తోందట. ఊళ్ళో మీటింగు పెట్టారు. ఎవరో నాయకుడు ఉద్యమం కోసం ఆత్మహత్యలు చేసుకున్న వాళ్ళని కీర్తిస్తూ మాట్లాడేసరికి, మా వాడికీ ఆవేశం వచ్చింది కాబోలు...' నేను సైతం...ఉద్యమం కోసం..' అంటూ రాసి ఉరేసుకున్నాడు. వాళ్ళ నాన్న ఈ విషయం వినగానే గుండెపోటు వచ్చి ప్రాణాలు ఒదిలేసాడు ! నేను కొంచెం గట్టిపిండాన్నే కాబోలు దిగులుతో మంచం పట్టానంతే ! నా ఈ గుండె ఘోష వచ్చిన వాళ్ళందరికీ చెబుతూంటే, నాకు పిచ్చి పట్టిందని ముద్ర వేసి ఉద్యోగంలోంచి తీసేసారు ! నా పిల్లాడు చేసిన పని నాకు సరియైనదిగా అనిపించలేదు. వచ్చిన వాళ్ళందరికీ అదే చెప్పేదాన్ని. అలా ప్రాణాలు తీసుకున్నవాళ్ళని అమరవీరులంటూ ప్రశంసించటమేమిటీ ? ఉద్యమం కోసం పోరాడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటే వాళ్ళు అమరవీరులవుతారు ! అంతే కదా !  మన పెద్దలు ఆత్మహత్య మహాపాపం అన్నారు. వీళ్ళేమో బలిదానాలంటున్నారు ! ఆత్మహత్యలు వద్దని ప్రసంగాలు చేస్తూనే అలా బలిదానాలు, అమరవీరులంటూ కీర్తించటమనేది అమాయకులకూ, ఆవేశపరులకూ తప్పుదారి చూపించటం కాదా ?

దేశం కోసం పనిచేసే సైనికులు యుద్ధం చేస్తూ ప్రాణాలు వదిలితే, వాళ్ళని దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులంటాం కదా ! అంతేగానీ ఇంట్లో ఆత్మహత్యలు చేసుకుంటే దేశానికేం లాభం ? అలాగే ఉద్యమం కోసం చివరివరకూ పోరాడాలిగానీ, ప్రాణం తీసుకోవటం ఏమిటి ? గుడిలో దేవతలకి పండుగ సందర్భంగానైనా మూగజీవుల్ని బలి ఇవ్వడం తప్పు, నేరం అని ప్రభుత్వం కూడా చెబుతోందా...మరి ఇదేమిటీ...తెలిసీ తెలియని వాళ్ళు ప్రాణత్యాగం అంటూ ఆత్మహత్యలకు పాల్పడుతుంటే...దాని వలన ఫలితం ఏంటని ప్రశ్నిస్తూ చివాట్లు పెట్టొద్దా..?

ఇలా నాకు కనిపించిన వాళ్ళందరి దగ్గరా నా ఆక్రోశాన్ని వెళ్ళబోసుకుంటుంటే...పిచ్చిదాన్నంటూ నా మాటల్ని పట్టించుకోలేదెవరూ. జవాబూ చెప్పలేకపోయారు.

ఒకరోజు నేనూ ఈ  ఒంటరి బ్రతుకెందుకని ప్రాణాలు తీసుకుందామని చెరువులోకి దూకుదామని వెళ్ళాను. అపుడే ఇద్దర్ని చెరువులో పడి ప్రాణాలు తీసుకున్న వాళ్ళని బయటకు తీశారు. అప్పులు పెరిగిపోయాయట. అందుకని ఇద్దరు చిన్న పిల్లల్ని అనాధలుగా చేయటానికీ వాళ్ళు వెనకాడకుండా ఆ పిచ్చి పని తలపెట్టారు.   బిక్కు బిక్కుమంటూ ఉన్న ఆ చిన్న పిల్లల్ని చూసి నేను నా ప్రయత్నాన్ని విరమించి వాళ్ళని వెంటబెట్టుకొచ్చి...పెంచుతూ జీవితాన్ని కొనసాగిస్తున్నాను.

నాకనిపించిందొకటే...నేను చనిపోతే ఏమవుతుందీ...వద్దనుకున్న ప్రాణాన్ని ఈ పిల్లలకోదారి ఏర్పరచి పెంచటానికి ఉపయోగించవచ్చు కదా అనుకున్నాను. ఇంటి ఎదురుగా ఉన్న మోడయిన చెట్టు...ఎప్పటికప్పుడు చిగిరించటం చూశాను. ప్రకృతిలోని చెట్టూ, చేమా దగ్గర్నుండి ప్రతీదీ ఆశను వదులుకోవద్దనే చెబుతోంటే...మనం ఎందుకు వినిపించుకోవటం లేదూ...? అవసరమైన వాళ్ళకి సాయం చేయటమే నా జీవితానికి అర్ధం అనుకున్నాను. అలాగే నాకోదారి కనిపించింది.." అంటూ వాళ్ళవైపు చూసి మళ్ళీ చెప్పింది. మీ నాన్నగారిలాంటివాళ్ళందరితోనో పరిచయం ఏర్పడి నా జీవితం...ఈ పిల్లల ప్రేమతో ఇలా సాఫీగా సాగిపోతోంది....నా సోదితో ఇబ్బంది పెట్టానా...?" అంది గిరి వైపు చూస్తూ.

" లేదండీ...ఒక మంచి స్ఫూర్తి పాఠం నేర్చుకున్నట్లనిపించింది మీ మాటలు వింటూంటే...!" అన్నాడు గిరి.

నందిని కూడా అవునన్నట్లు తలవూపి...చేతులు జోడించింది ఆమె వైపు చూస్తూ.

*****

ఆ మరునాడు ప్రకాశరావు తన అక్కకి ఫోను చేసి గిరిని వాళ్ళ ఊరికి వైజాగ్ పంపించేస్తున్నాననీ....ట్రైనెక్కించి ఇంటికి వచ్చానని చెప్పగానే ఆవిడ ఆదుర్దాగా ' ఒక్కడూ వస్తున్నాడా, ఫరవాలేదా' అని అడిగింది.

" ఏం ఫర్వాలేదక్కా...వాడికి పరోక్షంగా పాఠం నేర్పించి పంపుతున్నాను. ప్రాక్టికల్స్ కూడా పూర్తయ్యాయి. ఇపుడు వాడు ఆత్మహత్య ఆలోచన ఎవరైనా చేస్తున్నారని తెలిస్తే చాలు...చక్కగా పాఠం చెప్పగలడు ! " అన్నాడు చిరునవ్వుతో.

ఆవిడ ఫోనులో నిట్టూరుస్తూ మళ్ళీ చెప్పింది " గిరి తను ప్రేమించిన అమ్మాయి కాదన్నదని..ప్రాణాలు తీసుకుంటూన్నట్లుగా రాసిన నోట్ వాడికి తెలియకుండా నేను చూడటంతో నాకు నిజంగా మతిపోయినట్లనిపించింది. సమయానికి వాళ్ళ నాన్న కూడా ఇంట్లోలేరు. ఆఫీసు పని మీద వూరెళ్ళారా..అందుకే ఏం చేయాలో తోచక నీకు ఫోను చేస్తే...నువ్వు ఉపాయంతో ఇలా గట్టెక్కించావు ! " అంది.

" నందిని ఎంతో..నాకు గిరి కూడా అంతేగా. నువ్విలా జరిగిందని చెప్పగానే, మేం ముగ్గురం ఆలోచించి, ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం. పిల్లల మనస్తత్వాన్ని బట్టి, మనం తెలుసుకున్న జీవిత పాఠాల్ని వాళ్ళకీ అనునయంగా చెప్పగలగాలి !

అదే నేను చేసింది. నీకే కాదు, నాకూ ఇపుడు బరువు తీరినట్లు, తేలికగా ఉందక్కా. వాడు చేరాక ఫోన్ చేయించు. "

అంటూ ఫోను పెట్టేశాడు ప్రకాశరావు.

***సమాప్తం***